**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ: 22.10.2024** **సమయం 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. **ధరణి నిర్వహణా బాధ్యతను స్వదేశీ సంస్థ - నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (NIC)కి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.**

2. **ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ప్రజావాణికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి చిన్నా రెడ్డి తెలిపారు.**

3. **4G సేవలు ప్రారంభమైనప్పటి నుండి, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ చందాదారులు గత ఆరు నెలల్లో 75 లక్షల నుండి 1.8 కోట్లకు పెరిగారని కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు.**

4. **పాట్నాలోని ట్రావెల్ & టూరిజం ఫెయిర్ (TTF)లో తెలంగాణ టూరిజం, బుద్ధవనం స్టాల్‌ను కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈరోజు ప్రారంభించారు.**

**HARANI:**

**ఇప్పటి వరకు విదేశీ సంస్థ టెర్రాసిస్ చేతిలో ఉన్న ధరణి నిర్వహణా బాధ్యతను స్వదేశీ సంస్థ నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (NIC)కి అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డిసెంబర్ 1 వ తేదీ నుంచి తెలంగాణలో భూ రికార్డుల నిర్వహణా బాధ్యతను ఎన్ఐసి నిర్వహిస్తుందని మంత్రి చెప్పారు. త్వరలో ధరణి సమస్యల నుంచి ప్రజలకు పూర్తి విముక్తి కల్పిస్తామని వెల్లడించారు.**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం ముందు చూపు లేకుండా తొందర పాటు నిర్ణయాలతో తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొందని మంత్రి ఆరోపించారు. అప్పట్లో బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన 1.56 కోట్ల ఎకరాల భూమిని టెర్రాసిస్ అనే విదేశీ కంపెనీకి తాకట్టు పెట్టారని అన్నారు. ఒరిస్సా రాష్ట్రంలో ఈ సంస్థ పనిచేసి విఫలమైందని తెలిపారు. ఐదేళ్ల పాటు ధరణి పోర్టల్ రైతులను నానా ఇబ్బందులు పెట్టిందని, ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి ఇచ్చినట్లు తెలిపారు.

**PRAJAVANI:**

ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ప్రజావాణికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్మన్ జి.చిన్నా రెడ్డి తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలో 10 నెలల పెండింగ్‌లో ఉన్న దినసరి వేతనాలతో పాటు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న MEPMA రిసోర్స్ పర్సన్‌లు, RWSS శాఖ సిబ్బంది, వాణిజ్య పన్ను ఔట్ సోర్సింగ్ స్టాఫ్ పెండింగ్ జీతాల వంటి సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా పరిష్కరించామన్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌ను సందర్శించిన వివిధ సివిల్ సర్వీసెస్, సాయుధ దళాల అధికారులను ఉద్దేశించి చిన్నారెడ్డి మాట్లాడారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య మాట్లాడుతూ... ప్రతి మంగళ, శుక్రవారాల్లో రెండుసార్లు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**BSNL NEW LOGO:**

4G సేవలు ప్రారంభమైనప్పటి నుండి, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (BSNL) చందాదారులు గత ఆరు నెలల్లో 75 లక్షల నుండి 1.8 కోట్లకు పెరిగారని కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. ఈరోజు న్యూఢిల్లీలో మంత్రి BSNL కొత్త లోగోను, ఏడు కొత్త సేవలను మంత్రి ఆవిష్కరించారు. తన సొంత 4G టెలికాం నెట్‌వర్క్ ను అభివృద్ధి చేస్తున్న ప్రపంచంలోని ఆరు దేశాలలో భారతదేశం ఉందని, ఇది త్వరలో 5Gకి మారుతుందని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా, సింధియా స్పామ్-ఫ్రీ నెట్‌వర్క్, నేషనల్ వై-ఫై రోమింగ్, ఇంట్రానెట్

ఫైబర్ టీవీ, ఎనీటైమ్ సిమ్ కియోస్క్ లు, డైరెక్ట్-టు-డివైస్ సర్వీస్, పబ్లిక్ ప్రొటెక్షన్, డిజాస్టర్ రిలీఫ్, మొదటి ప్రైవేట్ 5Gతో సహా BSNL ఏడు సేవలను ప్రారంభించింది.

<u>నాగర్ కర్నూల్</u>

నాగర్ కర్నూల్ పట్టణంలో పార్లమెంట్ పరిధిలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి ఆధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... విద్య, నైపుణ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యువత స్వయం ఉపాధి లక్ష్యంగా కృషి చేయాలని మంత్రి కోరారు. ప్రతి యువతి, యువకులు విద్యా జ్ఞానంతో పాటు అంతర్జాతీయ నైపుణ్య అవకాశాలను పొందుపరచుకోవడం ప్రస్తుత ఎంతో ఆవశ్యకత ఉందని మంత్రి తెలిపారు.

**RBI:**

భారత్‌లో పెట్టుబడి డిమాండ్ పెరుగుతున్నందున ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. **2024-25** ఆర్థిక సంవత్సరానికి భారతదేశ వాస్తవ జిడిపి వృద్ధి **7.2** శాతంగా ఉందని శక్తికాంత దాస్ చెప్పారు. మెరుగైన వ్యవసాయ విధానం, గ్రామీణ డిమాండ్ నేపథ్యంలో ప్రైవేట్ వినియోగం అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు.

**CM:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ సాయంత్రం కేరళకు బయలుదేరి వెళ్తున్నారు. ప్రియాంక గాంధీ వయనాడ్ లోక్ సభ ఉప ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

**TOURISM:**

**పాట్నాలోని ట్రావెల్ & టూరిజం ఫెయిర్ (TTF)లో తెలంగాణ టూరిజం, బుద్ధవనం స్టాల్‌ను కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈరోజు ప్రారంభించారు. నాగార్జునసాగర్‌లో టీజీటీడీసీ అభివృద్ధి చేసిన బుద్ధవనం, బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు, ములుగు జిల్లా పాలంపేటలో ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం, గోల్కొండ కోటతో కూడిన తెలంగాణ స్టాల్‌ను కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి... తెలంగాణలో అద్భుతమైన స్మారక కట్టడాలు, అందమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని కొనియాడారు. పాలంపేటలోని రామప్ప ఆలయాన్ని, జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్‌లోని నవ బ్రహ్మేశ్వర, జోగులాంబ ఆలయాలను సందర్శిస్తానని తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రి - టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో సమావేశమై తెలంగాణను ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంపై చర్చించారు. తెలంగాణ రాష్ట్రానికి ఉన్న అపారమైన పర్యాటక సామర్థ్యాన్ని రమేష్‌రెడ్డి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కి వివరించారు.**

**<u>పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు</u>**

**పత్తి కొనుగోలు కొరకు మంచిర్యాల జిల్లాలో రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.**

**పిటిసి, మంచిర్యాల**